

26న జిల్లాలో అంచనాల కమిటీ పర్యటన

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రాష్ట్ర అంచనాల కమిటీ ఈ నెల 25 నుంచి 29వరకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించనుంది. 25వ తేదీ రాత్రికి విశాఖపట్టణం చేరుకోనున్న కమిటీ నాలుగు రోజుల పాటు ఉత్తరాంధ్ర పరిధిలోని విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పర్యటించి పలు అధికారిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కానుంది. ఛైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు అధ్యక్షతన కమిటీ సభ్యులైన ఎమ్మెల్యేలు భూమా అఖిల ప్రియ, నిమ్మక జయకృష్ణ, బండారు సత్యానందరావు, కందుల నారాయణరెడ్డి, మద్దిపాటి వెంకటరాజు, పార్థసారథి వాల్మీకి, పాసిం సునీల్ కుమార్, యేలూరి సాంబశివరావు, ఎమ్మెల్సీలు పెనుమత్స వి.వి. సూర్యనారాయణరాజు, వరుదు కళ్యాణి నాలుగు రోజుల పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించనున్నట్లు వివరించారు. 26న నగరంలో పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తారు. 27నఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్లో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమవుతారు. 2019-20, 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో జరిగిన పనులకు సంబంధించిన అంశాలపై సమీక్షిస్తారు. సాయంత్రం శ్రీకాకుళం బయలు దేరి వెళ్తారు.

నేడు అన్నదాత సుఖీభవ నిధులు జమ

- అర్హులైన రైతు కుటుంబానికి రూ.7 వేలు
- జిల్లాలో 2,27,700 మంది రైతుల ఖాతాలో రూ.150.03 కోట్లు జమ



ప్రజాశక్తి-విజయనగరం కోట

రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులు బుధవారం రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. ఎన్నికల సమయంలో రైతులకు పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు ఏడాదికి మూడు విడతలుగా 20 వేల రూపాయలు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ హామీల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పిఎం కిసాన్ రూ.6వేలతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం 14వేల రూపాయలు మొత్తంగా రూ.20వేలు అందిస్తోంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 2, 27,000 మంది రైతులకు లబ్ధి చేకూరే విధంగా మొదట విడతలో అన్నదాత సుఖీభవ ద్వారా ఒక రైతుకు రూ.5వేలు చొప్పున ఈ ఏడాది ఆగస్టు 2న రూ.113.85 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు. పిఎం కిసాన్ ద్వారా ఒక్కో రైతుకు రూ.2వేలు చొప్పున 1,93,000 మంది రైతులకు రూ.38కోట్లు వారి ఖాతాల్లో జమ చేశారు. ఆ సమయంలో రైతులకు సాగు ఖర్చులకు ఈ డబ్బులు ఉపయోగపడ్డాయి. రెండో విడత అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమం బుధవారం మధ్యహ్నం 2 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కడప జిల్లా కమలాపురంలో ప్రారంభిస్తారని కలెక్టర్ రామ సుందర్ రెడ్డి తెలిపారు.

అర్హత కలిగిన రైతు కుటుంబాలకు రూ.7వేలు చొప్పున జమ చేయనున్నారు. రెండో విడత నిధుల కార్యక్రమం జిల్లాలోని 2 లక్షల 27 వేల 700 మంది రైతుల ఖాతాలో రూ.150.03 కోట్లు జమ చేస్తారు. అర్హులైన భూమి యాజమాని రైతులకు ఖరీఫ్ లో రూ.7వేలు, రబీలో రూ.7వేలు, వేసవిలో రూ.6వేలు మొత్తంగా కేంద్రం వాటా రూ.6వేలు, రాష్ట్రం వాటా రూ.14వేలు మొత్తంగా రూ.20వేలు రైతు కుటుంబాలకు ఏటా అందజేయనున్నారు. వెబ్‌ల్యాండ్ డేటాలో నమోదైన భూమి యజమాని రైతు కుటుంబాలు, ఆర్ఓఎఫ్ఆర్ భూములు సాగు చేస్తున్న రైతు కుటుంబాలు కూడా అర్హత లోకి వస్తాయని, ఇకెవైసి తప్పనిసరిగా చేయాలని, జిఎస్‌డబ్ల్యుఎస్ హౌస్ హోల్డ్ డేటా బేస్‌తో అనుసంధానం చేయాలని, మరణం, అర్హత లేని కేసులపై నిరాకరణ జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

మండలం	రైతులు
విజయనగరం	4,605
నెల్లిమర్ల	6,414,
పూసపాటిరేగ	8,705
డెంకాడ	6932
భోగాపురం	5552
చీపురుపల్లి	6012
గరివిడి	8926
గుర్ల	11,066
మెరకముడిదాం	10,912
గంట్యాడ	10,761
గజపతినగరం	8,645
దత్తిరాజేరు	9,013
బొండపల్లి	7,706
మెంటాడ	7,269
శృంగవరపుకోట	8,973
జామి	8,950
వేపాడ	8,532
లక్కవరపుకోట	8,802
కొత్తవలస	5,887
బొబ్బిలి	10,982
రామభద్రపురం	7,282
బాడంగి	7,328
తెర్లాం	9,462
రాజాం	9,152
రేగిడి	11,986
సంతకవిటి	11,984
వంగర	5862

క్రమశిక్షణపై రాజీపడే ప్రసక్తే లేదు

కలెక్టర్ రామసుందర్ రెడ్డి ● ముగ్గురు సచివాలయ సిబ్బందికి షోకాజ్‌లు

ప్రజాశక్తి-రామభద్రపురం, బొబ్బిలి రూరల్

క్రమశిక్షణ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, సచివాలయ సిబ్బంది అందరూ సకాలంలో హాజరు కావాల్సిందేనని జిల్లా కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం రామభద్రపురం సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి అక్కడి సేవా కార్యకలాపాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టి నమోదు, ప్రజలకు అందుతున్న సేవల నాణ్యత, వివిధ విభాగాల పనితీరుపై సమగ్రంగా తనిఖీ చేశారు. కొంతమంది సిబ్బంది నిర్దేశిత సమయానికి విధులకు హాజరు కాకపోవడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు హాజరై మూమెంట్ రిజిస్టర్ లో నమోదు చేయకుండా బయటకు వెళ్లిన ఉద్యానవన సహాయకులు వరలక్ష్మి, సర్వేయర్ వరప్రసాద్, వెల్ఫేర్ అసిస్టెంట్ అరుణ్ చంద్ర కుమారిలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపిడిఒ రత్నంకు ఆదేశించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలందించడంలో ఎలాంటి అలసత్వం సహించబోదని ఆయన హెచ్చరించారు. సచివాలయ వ్యవస్థ ప్రజలకు అత్యంత సమీపంగా సేవలందించే వేదిక కాబట్టి, ప్రతి ఉద్యోగి సమయపాలన, బాధ్యత, క్రమశిక్షణతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.



పారాది అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సచివాలయ సిబ్బందికి సేవా దృక్పథం తప్పనిసరి

బొబ్బిలి మండలంలోని సాయినగర్ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు.సచివాలయంలో సిబ్బంది హాజరు, వివిధ శాఖల సేవల అమలు, రికార్డు నిర్వహణ, ప్రజలు పొందే సంక్షేమ పథకాల స్థితిగతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సచివాలయ సిబ్బందికి సేవా దృక్పథం తప్పనిసరి అని, ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. సచివాలయ స్థాయిలో చిన్నపాటి నిర్లక్ష్యమే ప్రజలకు పెద్ద ఇబ్బందులు కలిగించే అవకాశం ఉన్నందున, ప్రతి ఉద్యోగి తన బాధ్యత పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

అంగన్వాడీ సేవలపై రాజీ ప్రసక్తే లేదు

బొబ్బిలి మండలం పారాది గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, సౌకర్యాలు, రికార్డు నిర్వహణపై ఆరాతీశారు. మంగళవారం మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనంలో టమాట పప్పు వండాల్సి ఉన్నప్పటికీ అది తయారు చేయకపోవడం గుర్తించిన కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, నిర్లక్ష్యానికి బాధ్యురాలైన అంగన్వాడీ వర్కర్ ను తక్షణ చర్యగా సస్పెండ్ చేయాలని ఆదేశించారు. మూడు రోజులుగా అంగన్వాడీ కేంద్రంలో హాజరు నమోదు చేయకపోవడం పట్ల కూడా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, సంబంధిత సిడిపిఒకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు. జిల్లాలో అంగన్వాడీ సేవల నాణ్యతపై ఎలాంటి రాజీ లేదని, పిల్లల ఆరోగ్యం మరియు పోషకాహారంపై నిర్లక్ష్యాన్ని అసలు సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులతో కాసేపు సరదాగా గడిపి పిల్లలతో ముచ్చటించారు.



కారులో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగిన మావోయిస్టుల ఎన్‌కౌంటర్ దృష్ట్యా రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో మావోయిస్టుల కదలికల నేపథ్యంలో జిల్లా అంతటా ముఖ్య కూడళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌పి ఎఆర్ దామోదర్ తెలిపారు. ప్రజల భద్రత దృష్యాట శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముమ్మరంగా వాహన తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని పాత నేరస్తులపై కూడా నిఘా పెట్టినట్లు తెలిపారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా కదలికలు గమనించినట్లయితే వెంటనే స్థానిక పోలీసులకు లేదా 100/112 కు సమాచారం అందించాలని కోరారు.

ఎంఎస్‌ఎంఇ పార్కు పనులు అడ్డగింత

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలో కాకర్లవలస గ్రామంలో ఎంఎస్ఎంఇ పార్కు నిర్మాణ పనులను మంగళవారం సిపిఎం మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు ఆధ్వర్యాన గిరిజనులు అడ్డుకున్నారు. తమ భూములకు రెవెన్యూ అధికారులు పట్టాలు మంజూరు చేస్తే కానీ పనులు జరగనివ్వబోమని గిరిజనులు భీష్మించుకు కూర్చున్నారు. సుమారు ఐదు నెలలుగా ఈ వివాదం కొనసాగుతున్న, జిల్లా స్థాయి రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం దారుణమని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. జెసిబి ముందు కూర్చొని నిరసన తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు జరిగేందుకు సహకరించబోమని తేల్చిచెప్పారు. బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు, ఎస్ఐ ప్రసాదరావు అక్కడికి చేరుకుని, గిరిజనులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. ఈ సమస్య పరిష్కారానికి ఎపిఐఐసి, రెవెన్యూ అధికారులతో మాట్లాడుతానని సిఐ నారాయణరావు హామీ ఇచ్చినా గిరిజనులు అంగీకరించలేదు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ భూములను సాగుచేసుకొని జీవనోపాధి పొందుతున్నామని, అలాంటి భూములను ఎపిఐఐసికి ఎలా కేటాయిస్తారని గిరిజన మహిళలు తవుడమ్మ, లక్ష్మి, విజయలక్ష్మి ప్రశ్నించారు. గిరిజనుల ఆందోళనతో చివరికి పనులు నిలిపేశారు.



జెసిబికి అడ్డంగా నిలబడి నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

మహాత్మా మన్నించు!

గాంధీ విగ్రహానికి రంగులు పూసి అంధవికారంగా మార్చే యత్నం

ప్రజాశక్తి-మెంటాడ

స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు రక్షణ కరువైంది. ఆకతాయిల ఆగడాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. గాంధీ విగ్రహానికి రంగులు పూసి అంధవికారంగా మార్చిన ఘటన మెంటాడ హైస్కూల్లో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కొంతమంది ఆకతాయిలు ప్రహరీ గోడ పైనుంచి దూకి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడ్డారు. గాంధీ విగ్రహంపై రంగులు చల్లి, అంధ వికారంగా చేయడం అమానుషమని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిని కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సీతారాం తెలిపారు.



రంగులు పూసి అంధవికారంగా చేసిన గాంధీ విగ్రహం

కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

రైతులు పండించే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. పట్టణంలో ఉన్న పిఎసిఎస్‌లో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడం, బిల్లులు సకాలంలో ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని చెప్పారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు చేసి మిల్లుకు చేరేలోగా రైతుల బ్యాంకు ఖాతాకు బిల్లులు జమవుతాయని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. ఈ నెలలో మరో తుపాను వచ్చే అవకాశం ఉందని, పంటలకు నష్టం జరగకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు అల్లాడ భాస్కరరావు, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ రౌతు రామ్మూర్తి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



ధాన్యం తూనికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

లక్ష్యాలను సకాలంలో సాధించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

లక్ష్యాలను సకాలంలో సాధించాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలైన భూసేకరణ, ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, రైల్వే లైన్లు, ఎంఎస్ ఎంఇ పార్కులు పరిశ్రమల అభివృద్ధిపై కలెక్టర్ సమీక్షించారు. సకాలంలో లక్ష్యాలను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయా విభాగాల ఆధ్వర్యాన చేపడుతున్న పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా పనులకు స్పష్టమైన లక్ష్యాలు ఉండాలని, వాటిని నిర్దేశించిన గడువులలో పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణ కేసులపై అధికారులు పూర్తిస్థాయి డేటాను సిద్ధం చేయాలని, ప్రజాభ్యంతరాలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సూచించారు. రైల్వే మూడవ, నాలుగవ లైన్లలో భూసేకరణ వేగవంతం చేయాలన్నారు. ఎంఎస్ఎంఇ పార్కుల కోసం కేటాయించిన స్థలాల పురోగతిని పరిశీలించి, పెట్టుబడిదారులతో సమన్వయం పెంచి కొత్త యూనిట్లు త్వరగా స్థాపించేందుకు అవకాశాలు కల్పించాలన్నారు. సమావేశంలో జెసి సేధు మాధవన్, ఆర్‌డిఒలు డి. కీర్తి, రామ్మోహన్ రావు, ప్రమీల గాంధీ, భూసేకరణ అధికారులు, ఎపిఐఐసి, పరిశ్రమల శాఖల ప్రతినిధులు పలువురు తాహశీల్దార్లు పాల్గొన్నారు.

టారిఫ్ బోర్డులు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లాలో ఉన్న ప్రైవేట్ హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్, క్లినిక్స్, ల్యాబ్స్, స్కాన్ సెంటర్లు తప్పనిసరిగా టారిఫ్ బోర్డులను (ధరల పట్టిక) పెట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్.జీవన్ రాణి తెలిపారు. హాస్పిటల్‌లో తీసుకుంటున్న ఫీజులు, టెస్టుల వివరాలు, ధరలు పూర్తిగా అందరికీ కనబడే విధంగా ప్రదర్శించాలని సూచించారు. లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం అనే బోర్డులను ఇంగ్లీష్, తెలుగులో ప్రచురించి ప్రదర్శించాలని తెలిపారు. ప్రతీ హాస్పిటల్‌కు ఫైర్ ఎన్‌ఒసి తప్పనిసరిగా ఉండాలని, ఎవరైనా సంతాన సాఫల్య కేంద్రాలు నడుపుతున్న ఎడల ఎఆర్‌టి, సరోగసి చట్టం అనుసరించి జాతీయ పోర్టల్ లో రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు.

అయ్యప్ప స్వాములు జాగ్రత్తలు తీసుకోవాలి

నదుల్లో స్నానాలు చేసేటప్పుడు అయ్యప్ప స్వాములు జాగ్రత్తలు తీసుకోవాలని డిఎంహెచ్ఒ జీవనరాణి సూచించారు. ముఖ్యంగా ముక్కు రంధ్రాలను, నోటిని చేత్తో మూసుకొని స్నానం చేయాలని, దీనివల్ల అంటురోగాలు రావని తెలిపారు.

32 అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. మొత్తం 32 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అందరి సమన్వయంతో నగరాన్ని అభివృద్ధి చేయడమే ధ్యేయంగా కృషి చేయాలన్నారు. మిగిలి ఉన్న అభివద్ధి పనులను సత్వరమే పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. నిబంధనల ప్రకారం అధికారులు నడుచుకోవాలని సూచించారు. సమావేశంలో ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, కమిషనర్ పల్లి నల్లనయ్య, సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, స్టాండింగ్ కమిటీ సభ్యులు అల్లు చాణక్య, జివి రంగారావు, సుంకర నారాయణస్వామి, రేగాన రూపాదేవి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్‌లో మెరుగైన ర్యాంకులు సాధించాలి

కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రస్థాయి ర్యాంకుల్లో ముందంజలో నిలవాలని కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన విద్యా విభాగ సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ప్రతిభను కొలిచే మొదటి ప్రమాణం వారి ర్యాంకేనని, ఉపాధ్యాయులు ప్రత్యేక వ్యూహాలు రూపొందించి విద్యార్థులను మెరుగైన ఫలితాల కోసం ప్రోత్సహించాలని సూచించారు. తక్కువ పెర్ఫార్మెన్స్ ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి అదనపు బోధన అందించాలని, పాఠశాల విడిచిపెట్టే వారి సంఖ్యను తగ్గించేందుకు చురుకైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు మించి ర్యాంకులు సాధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పాఠశాలల్లో శుభ్రత, పరిశుభ్ర వాతావరణం, పిల్లల్లో చదువు పట్ల ఆసక్తి పెంచడం వంటి అంశాలను ప్రాధాన్యంగా చూడాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై దృష్టి పెట్టి మెనూను కచ్చితంగా పాటించాలని, అన్నం వండేటప్పుడు 'వార్చడం' పద్ధతి పూర్తిగా మానుకోవాలని, గ్యాస్ స్టవ్ మీదే ఆహారం తయారు చేయాలని సూచించారు. పాఠశాల ఆర్ఒ ప్లాంట్ల నిర్వహణ బాధ్యత హెచ్ఎంలదేనని, ఆర్వో ప్లాంట్లు లేని పాఠశాలలకు త్వరలోనే ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. డిఇఒ మాణిక్యం నాయుడు మాట్లాడుతూ, గత సంవత్సరం 87శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో జిల్లా ఏడవ స్థానంలో నిలిచిందని, ఈసారి మరింత మెరుగైన ఫలితాలు సాధనకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని కోరారు. డిసెంబర్ 5 లోపు మొత్తం సిలబస్ పూర్తి చేసి, 100 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రత్యేక క్లాసులు నిర్వహించాలని సూచించారు. సమావేశం అనంతరం ఉత్తమ సేవలందించిన స్కౌట్ మాస్టర్స్‌ను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖ డిడిలు, ఎంఇఒలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాలను అనుమతించేది లేదు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో అనధికార, అనుమతి లేని నిర్మాణాలను, కట్టడాలను అనుమతించబోమని కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. ప్రణాళిక సిబ్బంది ఉడా కాలనీలోని అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర క్రమబద్ధీకరణ చర్యల్లో భాగంగా అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. దీంతో ప్రతిరోజు ఏదో ఒక ప్రాంతంలో గుర్తించిన అనుమతి లేని, అనధికార నిర్మాణాలను కూల్చివేస్తున్నామన్నారు. ఇప్పటికైనా నిర్మాణదారులు చైతన్యవంతులై నిర్మాణ అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అలాగే అదనపు భవనాల నిర్మాణాలు కూడా ఖచ్చితమైన అనుమతులు పొందాల్సిందేనని చెప్పారు. లేని పక్షంలో అనధికార నిర్మాణాలను కూల్చివేస్తామని స్పష్టం చేశారు.

సారిపల్లి గ్రామస్తులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

తారక రామతీర్థసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన సారిపల్లి గ్రామస్తులకు న్యాయం చేయాలని మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు.. కలెక్టర్ రామసుందర్ రెడ్డికి విన్నవించారు. పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి గేదెల రాజారావు, ఆ గ్రామ నాయకులు బోను మహంతి ఆదినారాయణ, సారిపల్లి బాబూరావు, సారిపల్లి నాగరాజుతో కలిసి కలెక్టర్‌కు మంగళవారం వినతి అందించారు. ప్రాజెక్టు సర్ ప్లస్ కెనాల్ నిర్మాణంలో 15.45 ఎకరాల జిరాయితీ భూమిని కోల్పోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. నిర్ణయించిన ధర ప్రకారం చెల్లించాలని రైతులు రెవెన్యూ అధికారులను కోరినప్పటికీ ఆ పరిహారం మొత్తాన్ని కోర్టులో డిపాజిట్ చేశారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించి, పరిహారం వెంటనే అందజేయాలని కోరారు. భూముల ముంపుతో జీవనాధారం కోల్పోయిన సుమారు 1500 కుటుంబాలకు పిఎఫ్ ప్యాకేజి మంజూరు చేయాలని విన్నవించారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టు గట్టు కొండను తాకకుండా ప్లాన్ మార్చాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు ఆల్తి ప్రకాశరావు, సారిపల్లి గోపాలమూర్తి, బోనుమహంతి ప్రభాకర్ తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బంగార్రాజు

సామాజిక న్యాయం కోసం పోరాటం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రంలో నరేంద్రమోడీ అధికారం చేపట్టిన 12 ఏళ్ల కాలంలో దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలపై దాడులు మితిమీరిపోతున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు అన్నారు. సామాజిక న్యాయం-ఆత్మగౌరవం కోసం దళిత, గిరిజన, మైనారిటీల పై దాడులను ఖండిస్తూ జనగణనలో కులగణన చేపట్టాలని కోరుతూ సిపిఐ దేశవ్యాప్త ఆందోళనల పిలుపులో భాగంగా మంగళవారం ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద నిరసన తెలిపారు. నియోజకవర్గ కార్యదర్శి బుగత అశోక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కామేశ్వరరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం, ప్రజాస్వామిక హక్కులను హరించే దుష్ట శక్తులను తిప్పికొట్టేందుకు ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలన్నారు. దేశంలో మతోన్మాదం, అణిచివేత, అంటరానితనం, కుల వివక్షత, హింస పేట్రేగిపోతున్నాయని మండిపడ్డారు. ఆర్ఎస్ఎస్, సంఘపరివార్ కనుసన్నలలో భారత రాజ్యాంగ, లౌకిక, ప్రజాస్వామ్య వ్యతిరేక పాలన సాగిస్తున్నారన్నారు. మోడీ పాలనలో ఎస్సి, ఎస్టి, మైనారిటీలకు రక్షణ ప్రశ్నార్థకమైందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, ఎస్.రంగరాజు, పొందూరు అప్పలరాజు, ఎ.రాములు, కె.స్రవంతి, పొడుగు రామకృష్ణ, బూర వాసు, వెలగాడ రాజేష్, సూరిడమ్మ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : దేశంలో దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులు అరికట్టాలని పట్టణంలో దక్షిణ దేవుడు సెంటర్ వద్ద సిపిఐ ఆధ్వర్యాన మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా నాయకులు కోట అప్పన్న, మునకాల శ్రీనివాస్ మాట్లాడుతూ మోడీ హయాంలో మైనారిటీలపై దాడులు మితిమీరిపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ నాయకులు సూరి, వై.బాబ్జి, సత్యనారాయణ, రాములు పాల్గొన్నారు.



విజయనగరంటౌన్.. నిరసన తెలుపుతున్న సిపిఐ నాయకులు, కార్యకర్తలు

పరిశ్రమలతో ఉద్యోగావకాశాలు

ఎమ్మెల్యే కళా

ప్రజాశక్తి-చీపురుపల్లి

రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు తెలిపారు. మంగళవారం చీపురుపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చీపురుపల్లి నియోజకవర్గంలో ఐరన్ ఎగుమతి ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు తాజాగా జరిగిన సమ్మిట్‌లో ఎంఒయు చేసుకున్నట్లు తెలిపారు. ఇది నిర్మాణం జరిగితే ఈ ప్రాంత యువతకు భారీగా ఉద్యోగావకాశాలు వస్తాయని తెలిపారు. దీని కోసం దమరసింగి మీదుగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు ప్రత్యేక రోడ్డు మార్గం కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గత ఐదేళ్లలో ఆటవిక ప్రభుత్వం నడిచిందని, ఆ ప్రభుత్వంలో పరిశ్రమలున్న వారినందరినీ పంపించేశారని విమర్శించారు. సమావేశంలో ఎఎంసి చైర్మన్ రేగాన రామారావు, ఆర్‌ఇసిఇస్ మాజీ చైర్మన్ దన్నాన రామచంద్రుడు, పైల బలరాం, గవిడి నాగరాజు, సారిపాక సురేష్ పాల్గొన్నారు.

రోడ్డు వేయాలని మొర

రోడ్డు వేసి తమకు న్యాయం చేయాలని చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని కొత్త అగ్రహారం, రిక్షా కాలనీ వాసులు ఎమ్మెల్యే కళాకు మొర పెట్టుకున్నారు. రైల్వే బ్రిడ్జి పనులతో రిక్షా కాలనీ, కొత్త అగ్రహారానికి వెళ్లాల్సిన రోడ్డు మార్గం చిన్నది కావడంతో స్థానికులు గత కొన్ని రోజులుగా ఆందోళన చెందుతున్నారు. రోడ్డు మూసి వేయడం వల్ల తమ ఇళ్లకు వెళ్లేందుకు మార్గం లేదని ఎమ్మెల్యే వద్ద వాపోయారు. ఒకానొక దశలో కళావెంకటరావు చీపురుపల్లి వస్తున్నారని తెలిసి బ్రిడ్జి వద్దే వారు ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకునేందుకు యత్నించారు. అది గమనించిన కళా.. ఇబ్బందులుంటే కార్యాలయానికి రావాలని చెప్పడంతో అక్కడికి వెళ్లి తమ గోడు వినిపించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు.



ఎమ్మెల్యే కళావెంకటరావుకు సమస్య వివరిస్తున్న బాధితులు

గిరిజన గ్రామాల్లో సమస్యలపై పోరాటం

ప్రజాశక్తి- మెంటాడ

గిరిజన గ్రామాల్లో సమస్యలపై పోరాటం సాగిస్తామని గిరిజన సంఘ జిల్లా కన్వీనర్ తామరాపల్లి సోములు, కౌలు రైతుల జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాములు తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా గిరిజన గ్రామాలకు రహదారి, తాగునీటి సౌకర్యాలు లేవన్నారు. కొండ జీరికవలస, కుంబివలస, కూనేరు పంచాయతీ ఎగువ మిర్తి వలస, దిగువ మిర్తి వలస గ్రామాలకు చెందిన గిరిజనులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఆంధ్ర ప్రాజెక్టు నిర్వాసితులకు చేపల సొసైటీ ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు. గుర్ల ప్రాజెక్టు అసంపూర్తిగా ఉందని, దీనికి అదనపు నిధులు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేసి రైతులకు సాగునీరు అందివ్వాలని కోరారు. గిరిజనులకు, దళితులకు, నిరుపేదలకు ప్రభుత్వ బంజరు, పోడు భూములు, అసైన్డ్ భూములు 25 ఏళ్లుగా సాగులో ఉన్న వారికి పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇప్పించాలని డిమాండ్‌చేశారు.

20న ఖోఖో అసోసియేషన్ సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 20న సాయంత్రం నాలుగు గంటలకు నగరంలోని హోటల్ జిఎస్‌ఆర్‌లో జిల్లా ఖో ఖో సంఘ సర్వసభ్య సమావేశం, నూతన కార్యవర్గ ఎన్నిక జరుగుతుంని ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పెనుమజ్జి విజయలక్ష్మి, సిహెచ్ సత్యనారాయణ తెలిపారు. సభ్యులంతా సమావేశానికి హాజరు కావాలని తెలిపారు.


వాగ్వివాదానికి దిగిన మహిళలు

ముంజేరులో మరోమారు కాలువల వివాదం
ఏళ్లు గడుస్తున్నా పరిష్కారం కాని సమస్య

ప్రజాశక్తి-భోగాపురం
మండలంలోని ముంజేరు వీధి కాలువలు గొడవ చిలికి చిలికి గాలివానలా మారుతోంది. ఎన్నో ఏళ్లగా నలుగుతున్న ఈ సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. ఈ సమస్య గతంలో జిల్లా ఉన్నత స్థాయి అధికారుల వరకు వెళ్లినప్పటికీ వారు కూడా పరిష్కరించలేకపోయారు. ఈ కాలువ నిర్మాణ సమస్య రెండు సామాజిక వర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తలకు దారితీస్తుంది. ఇదే సమస్యపై గత మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే, ఆ గ్రామ సర్పంచ్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మరో మారు కాలువ పనులు చేసేందుకు మంగళవారం ఒక గ్రూపు వారు ప్రయత్నించగా మరో గ్రూపు వారు అడ్డుకున్నారు. దీంతో ఇరు గ్రూపుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి. ఈ సమస్య పరిష్కరానికి అధికారులు చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొనసాగుతున్న నిర్వాసితుల నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట
మండలంలోని బొడ్డవరలో జిందాల్ నిర్వాసితులు చేపట్టిన నిరసన మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ నిర్వాసితులను ఉద్దేశించి మాట్లాడారు. భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉద్యోగాలు, శిక్షణ, వేతనం ఇవ్వకుండా సుమారు 65 మంది బినామీలకు ఇప్పటికీ ఉద్యోగాల పేరుతో సొమ్ము చెల్లిస్తున్నారని, దీనిపై విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్‌లో
కానిస్టేబుల్ మూర్తికి బంగారు పతకం

ప్రజాశక్తి - కంటోన్మెంట్
జిల్లా పోలీసుశాఖలో ట్రాఫిక్ కానిస్టేబులుగా పని చేస్తున్న బిఎస్ఎన్ మూర్తి ఇటీవల కాకినాడలో జరిగిన 14వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తైక్వాండో పూమ్సే ఛాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించడంతోపాటు, త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లుగా ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. మంగళశారం జిల్లా పోలీసు కార్యాలయంలో మూర్తిని అభినందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ స్పోర్ట్స్‌లో రాణించాలంటే శారీరక ధృఢత్వం ఎంతో ముఖ్యమని, ఆరోగ్యం కాపాడుకుంటూ రానున్న రోజులలో జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించి జిల్లా పేరును, జిల్లా పోలీసుశాఖ ప్రతిష్టను జాతీయ స్థాయిలో నిలిపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ సూరి నాయుడు, ఎస్‌బి సిఐ ఎవి లీలారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉల్లాస్ శిక్షణ

ప్రజాశక్తి-భోగాపురం
ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక వెలుగు కార్యాలయంలో వాలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వయోజన విద్య జిల్లా నోడల్ అధికారి ఎ.వేణుగోపాల్ మాట్లాడుతూ వయోజనులకు విద్యాబోధనలో సేవాభావం, నిబద్ధత అత్యంత ముఖ్యమని చెప్పారు. ఎంపిడిఒ స్వరూపరాణి మాట్లాడుతూ అక్షరాస్యతతోనే సమాజ పురోగతి సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఎఒ హైమావతి, డిప్యూటీ ఎంపిడిఒ గాయత్రి, వయోజన విద్యా శాఖ పర్యవేక్షకులు జి.జయరాం, రిసోర్స్ టీచర్ శ్రీనివాస్, ఎపిఎం పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేటి నుంచి పరిశుభ్రతపై శిక్షణ

ప్రజాశక్తి-గంట్యాడ
స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం నుంచి మూడు రోజులపాటు పచ్చదనం, పరిశుభ్రత అంశంపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపిడిఒ ఆర్‌వి రమణమూర్తి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులకు, గురువారం వెలుగు విఒఎలు, సభ్యులకు, శుక్రవారం పారిశుధ్య కార్మికులకు తడి, పొడి చెత్త వేరు చేయడంపై శిక్షణ అందిస్తామన్నారు.

వేపాడ : ఈ నెల 19, 20, 21న ఎంపిడిఒ కార్యాలయంలో పచ్చదనం, పరిశుభ్రతపై శిక్షణ ఇస్తున్నట్లు ఎంపిడిఒ సిహెచ్.సూర్యనారాయణ తెలిపారు. 19న సర్పంచులు, ఉప సర్పంచుల, కార్యదర్శులకు, 20న విఒఎలు, స్వయం సహాయక సభ్యులకు, 21న గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులు, ఎంఆర్‌సిలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

నెల్లిమర్ల : ఈ నెల 19, 20, 21న పచ్చదనం, పరిశుభ్రత పై మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపిడిఒ కె.రామక్రిష్ణ రాజు తెలిపారు. 19న సర్పంచులు, ఉప సర్పంచుల, కార్యదర్శులకు, 20న విఒఎలు, స్వయం సహాయక సభ్యులకు, 21న గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డ్స్, మండల రిసోర్స్ కో-అర్డినేటర్‌కు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

మెరకముడిదాం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పచ్చదనం - పరిశుభ్రతపై మూడు రోజులపాటు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జి.భాస్కరరావు తెలిపారు. ఈనెల 19న పంచాయతీ సర్పంచులు, ఉప సర్పంచ్‌లు, కార్యదర్శులతో, 20న ప్రతి పంచాయతీ నుండి ఇద్దరు విఒఎలకు సంబంధించి అధ్యక్ష, కార్యదర్శులు, ఇద్దరు ఎన్ హెచ్ జి సభ్యులు, 21న గ్రీన్ అంబాసిడర్‌లు, గ్రీన్ గార్డ్స్ హాజరు అవుతారని తెలిపారు.

ఆధార్ శిబిరాన్ని సందర్శించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి-గంట్యాడ
మండలంలోని లక్కిడాం గ్రామంలో ఆధార్ శిబిరాన్ని మంగళవారం ఎంపిడిఒ ఆర్.వి. రమణమూర్తి సందర్శించారు. పాఠశాల విద్యార్థులకు చేపడుతున్న ఆధార్ అప్డేట్ ప్రక్రియను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు అందించారు.


ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

గుజ్జంగివలసలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-గుర్ల
మండలంలో గుజ్జంగివలస గ్రామంలో మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. పనులను సర్పంచ్ రెడ్డి పద్మావతి, కార్యదర్శి విజయలక్ష్మి పర్యవేక్షించారు. గ్రామస్తులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సర్పంచ్, కార్యదర్శి సూచించారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన వారధులు

ప్రజాశక్తి-విజయనగరం కోట
గ్రంథాలయాలు విజ్ఞాన వారధులని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగలి పోతన్న, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నాల బాలకృష్ణ అన్నారు. గ్రంథాలయ సంస్థలు రాజకీయ పునరావాస కేంద్రాలు కాకూడదని అన్నారు. గ్రంథాలయ సంస్థల చైర్మన్లుగా, సభ్యులుగా రాజకీయ ప్రమేయం లేని విజ్ఞానవంతులను, గ్రంథాలయ ఉద్యమకారులను నియమించాలని విజ్ఞప్తి చేశారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం గురజాడ జిల్లా స్మారక కేంద్ర గ్రంథాలయంలో నవ్యాంధ్ర ప్రజా గ్రంథాలయ ఆధ్వర్యంలో విజ్ఞాన నిధులు - మన గ్రంథాలయాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానానికి వారధులని, అటువంటి గ్రంథాలయాల సంస్థలకు రాజకీయ రంగు పులమకుండా అభ్యుదయ భావజాలం, సమాజ హితం కోసం నిరంతరం పోరాటం చేసే వ్యక్తులను గ్రంథాలయ సంస్థలకు చైర్మన్లు, సభ్యులుగా నియమిస్తే గ్రంథాలయాలు మరింత అభివృద్ధి సాధిస్తాయని అన్నారు. ఎంతో మంది మహనీయులు చేసిన ఉద్యమాలు ఫలితంగా నేడు గ్రంథాలయాలు ఏర్పాటయ్యాయని పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎంవిఎన్ వెంకట్రావు మాట్లాడుతూ ప్రపంచ జ్ఞానం గ్రంథాలయాల్లో ఉంటుందని, అటువంటి గ్రంథాలయాలను యువత సద్వినియోగం చేసుకొని విజ్ఞానవంతులుగా మారాలని ఆకాంక్షించారు. విజయనగరంలో గత 15 ఏళ్లుగా షణ్ముఖరావు ఉద్యోగ విరమణ ద్వారా వచ్చే పింఛను డబ్బుల్లో కొంత మొత్తాన్ని ఖర్చు చేస్తూ ప్రజా గ్రంథాలయాన్ని నిర్వహిస్తూ ఎంతోమంది నిరుద్యోగ యువతను ఈ గ్రంథాలయం ద్వారా ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారని అన్నారు. నవ్యాంధ్ర ప్రజా గ్రంథాలయం వ్యవస్థాపకులు పి. షణ్ముఖరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర ప్రజా గ్రంథాలయ కార్యదర్శి ఈపు విజయ్ కుమార్, నాస్తిక సమాజం జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగలి పోతన్న

ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు

జిల్లా గ్రంథాలయ సంస్థలో విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. రిటైర్డు డ్రాయింగ్ టీచర్ కడలి ప్రకాష్ రావు జడ్జీగా వ్యవహరించారు. పోటీల్లో గురజాడ పబ్లిక్ స్కూల్, కస్పా హై స్కూల్, డఫ్ అండ్ డమ్ స్కూల్, సెయింట్ మేరీ స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి. లక్ష్మి, జిల్లా సహాయ గ్రంథాలయ అధికారి ఎస్. జ్యోతి పాల్గొన్నారు.

పద్యాల పై పట్టు సాధించాలి

విద్యార్థులు తెలుగు పద్యాలపై పట్టు సాధించాలని పాఠశాల విశ్రాంతి ఉద్యోగులు రాములప్పడు అన్నారు. గాజులరేగ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పద్య పోటీలు నిర్వహించారు. నారాయణ స్కూల్, జెడ్‌పి హైస్కూలు విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి ఎం.లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు రిటైర్డు ఉద్యోగి రాములప్పడు జడ్జిగా వ్యవహరించారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు

తెర్లాం : స్థానిక గ్రంథాలయంలో శాఖా గ్రంథాలయాధికారి సిహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ ఇఒ బి.రమణ, తెలుగు టీచర్ శంకర్రావు, మెరకముడిదాం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్.తిరుపతి రావు, అంగన్వాడీ కార్యకర్త శ్రీదేవి పాల్గొన్నారు.

మెరకముడిదాం : మెరకముడిదాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు పరిశి నాయుడు, లైబ్రేరియన్ ఎ. బుచ్చంనాయుడు పాల్గొన్నారు.

గంట్యాడ : స్థానిక గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాస్ ఆధ్వర్యాన వ్యాచరచన పోటీలు నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మూజికల్ చైర్ గేమ్స్ నిర్వహించారు.

నెల్లిమర్ల : మొయిదా శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ జి.రమణమ్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బి.సత్యనారాయణ విద్యార్థులకు కబడ్డీ, చిత్రలేఖన, వ్యాసరచన పోటీలను నిర్వహించారు.

గ్రీన్ అంబాసిడర్ల ధర్నా

ప్రజాశక్తి -తెర్లాం
బకాయి వేతనాలు చెల్లించాలని స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం సిఐటియు ఆధ్వర్యాన గ్రీన్ అంబాసిడర్లు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శంకరరావు, నాయకులు సింగిరెడ్డి గోపాల్, రామారావు మాట్లాడుతూ మండలంలో 4 నెలల నుంచి 18 నెలల వరకు గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించాల్సి ఉందన్నారు. తెల్లవారితే గ్రామాలను శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న గ్రీన్ అంబాసిడర్లకు నెలల తరబడి జీతాలు చెల్లించకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. సంబంధిత శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఇది ఆలోచించకపోవడం అన్యాయమన్నారు. వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వం నేరుగా గ్రీన్ అంబాసిడర్ల అకౌంట్లలో జీతాలు చెల్లించే పద్ధతిని తీసుకురావాలని డిమాండ్‌చేశారు. ధర్నాలో గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, గ్రీన్ అంబాసిడర్లు

ప్రజా సమస్యలపై పనిచేయాలి

ప్రజాశక్తి -బొబ్బిలి
ప్రజా సమస్యలపై పని చేయాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి.. జన సైనికులను కోరారు. మున్సిపాలిటీలోని 19వ వార్డులో మంగళవారం జనసేన జెండాను ఎగుర వేసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో సమస్యలు జనసైనికుల దృష్టికి తెస్తే పరిష్కారానికి పని చేస్తామన్నారు. ప్రజల మధ్య నిత్యం ఉండి సమస్యలు తెలుసుకోవాలని జనసైనికులకు సూచించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, వీరమహిళలు పాల్గొన్నారు.


జనసైనికులతో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి

పారిశుధ్య పనులపై సమీక్ష


చెత్త సేకరణను పరిశీలిస్తున్న సిఇఒ సత్యనారాయణ

ప్రజాశక్తి-గజపతినగరం
జిల్లా పరిషత్ సిఇఒ బి. సత్యనారాయణ మంగళవారం గజపతినగరం మండలంలోని గుడివాడలో ఐవిఆర్ఎస్ కాల్స్‌తో పాటు పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుధ్యానికి సంబంధించి పకడ్బందీగా పనులు చేపట్టాలని అధికారులకు సూచనలు సలహాలు ఇచ్చారు. పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పలువురు గ్రామస్తులతో మాట్లాడి పారిశుధ్య పనులపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మరుపల్లి సచివాలయాన్ని కూడా సందర్శించి, అక్కడ జరుగుతున్న కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి. కళ్యాణి, డిప్యూటీ ఎంపిడిఒ జి. జనార్ధనరావు, మరుపల్లి పంచాయతీ సెక్రెటరీ రమణ, సర్పంచ్ ప్రతినిధి లెంక సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ పార్లర్లు ప్రారంభం

ప్రజాశక్తి-దత్తిరాజేరు
మండలంలోని పెదమానాపురం కూతవేటు దూరంలో జాతీయ రహదారి ఆనుకొని ఏర్పాటుచేసిన విశాఖ డెయిరీ పార్లర్‌ను ఆ సంస్థ చైర్మన్ ఆడారి ఆనందరావు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మేనేజర్ రామచంద్రరావు, సింహాద్రి నాయుడు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

మెరకముడిదాం : మండలంలో గర్భాం, మెరకముడిదాం గ్రామాల్లో విశాఖ డెయిరీ రూరల్ మార్కెటింగ్ పార్లర్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆ సంస్థ చైర్మన్ ఆడారి ఆనందరావు ప్రారంభించారు. గర్భాంలో చందక రవణమ్మ రూరల్ డెయిరీ పార్లర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, తాడ్డి సన్యాసినాయుడు, చందక సాంబమూర్తి పాల్గొన్నారు.

క్రీడలతో మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి-బొబ్బిలి
క్రీడలతో విద్యార్థులు, యువతకు మంచి భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక సంస్థానం పాఠశాల మైదానంలో ఈ నెల 9న జరిగిన తైక్వాండో బెల్ట్ ప్రమోషన్ టెస్ట్‌లో జి.షణ్ముఖ్ నందన్, మోహన్ మురళీకృష్ణ రెడ్ బెల్ట్ - 1, శ్రీవర్ధన్ రెడ్, జ్యోష్నప్రియా, నిహాల్ అభిరామ్ ఎల్లో బెల్ట్ సాధించారు. వీరిని మంగళవారం కోటలో ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కోచ్ బంకురు ప్రసాద్, క్రీడాకారులు ఉన్నారు.

20న ద్విచక్ర వాహనం వేలం

ప్రజాశక్తి-నెల్లిమర్ల
ఈ నెల 20న సీజ్ చేసిన ద్విచక్ర వాహనం వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సిఐ ఎం.వెంకట్రావు తెలిపారు. ఆసక్తి ఉన్న వ్యక్తులు అదేరోజు ఉదయం 11.30 గంటలకు నెల్లిమర్ల ఎక్సైజ్ స్టేషన్‌కు రావాలని సూచించారు.

బాలికల భద్రతే ప్రధాన లక్ష్యం

ప్రజాశక్తి- కంటోన్మెంట్
బాలికల భద్రతే ప్రధాన లక్ష్యమని విజయనగరం మహిళా పోలీసు స్టేషన్ సిఐ ఇ.నరసింహమూర్తి అన్నారు. మంగళవారం తోటపాలెంలోనివిజ్ఞాన్ జెవిఎస్ జూనియర్ కళాశాల, కె.ఎల్ పురంలోని శ్రీలక్ష్మి గణపతి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, శక్తి యాప్, డిజిటల్ అరెస్ట్, పోక్సో చట్టం, మహిళా భద్రత, రహదారి భద్రత గంజాయి, మాదకద్రవ్యాలు వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా సిఐ నరసింహమూర్తి మాట్లాడుతూ సైబరు నేరాలు పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులకు సరైన అవగాహన లేకపోవడం వలన సోషల్ మీడియాలో ప్రచారమయ్యే విషయాలు నిజమని భావించి, డబ్బులను పోగొట్టుకుంటున్నారని అన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు చేసే కాల్స్‌కు స్పందించవద్దని, వారు పంపే లింకులపై క్లిక్ చేయవద్దని, ఇతరులతో ఒటిపి నంబర్లను షేర్ చెయ్యవద్దన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ శిరీష పాల్గొన్నారు.

'గ్లోబల్ వ్యూ' విద్యార్థులకు బంగారు పతకాలు

ప్రజాశక్తి-రామభద్రపురం
స్థానిక గ్లోబల్ వ్యూ పాఠశాల విద్యార్థులు తైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు సాధించినట్లు పాఠశాల చైర్మన్ వెంకటరమణ తెలిపారు. ఒడిశాలో ఇటీవల జరిగిన ఓపెన్ నేషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో గ్లోబల్‌వ్యూ పాఠశాల విద్యార్థులు తస్విక్‌రావు, లిఖితరావు పతకాలు సాధించినట్లు తెలిపారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ చంద్రమోహన్, ప్రిన్సిపల్ సంధ్య, సిబ్బంది అభినందించారు.


పతకంతో లిఖిత

సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందివ్వడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. అందువల్లనే ప్రతి 15 రోజులకు ఓసారి నగరంలో ఉన్న అన్ని వాటర్ ట్యాంకులను పరిశుభ్రపరుస్తున్నట్లు చెప్పారు. ఆయన ఆదేశాలతో సిబ్బంది మంగళవారం వాటర్ ట్యాంకుల పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుళాయిల ద్వారా సురక్షితమైన తాగునీటిని ప్రజలకు అందిస్తున్నామన్నారు. పైప్ లైన్ లీకేజ్ సమస్యలను లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడుతున్నామన్నారు. అన్ని సచివాలయాల పరిధిలో ప్రతిరోజు నీటి నాణ్యత పరీక్షలను చేపడుతున్నామన్నారు.

ధాన్యం సేకరణపై శిక్షణ

ప్రజాశక్తి-భోగాపురం
స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలుపై వ్యవసాయ శాఖ, సొసైటీ సిబ్బందికి మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు, తహశీల్దార్ రమణమ్మ, వ్యవసాయ అధికారి కె.హైమావతి, సిఎస్ డిటి మురళి హాజరయ్యారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రత్యేక అధికారి సిబ్బందిని ఆదేశించారు. మండలంలో పోలిపల్లి, భోగాపురం సొసైటీల ద్వారా కొనుగోలు చేపడుతున్నట్లు తహశీల్దార్ రమణమ్మ తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 1,700 ఎకరాల్లో వరి సాగైందని, గతేడాది 2,500 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని ఎఒ హైమావతి తెలిపారు. ఈ ఏడాది దాదాపు 3 వేల మెట్రిక్ టన్నుల లక్ష్యం నిర్ణయించినట్లు చెప్పారు.

అంగన్వాడీ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-దత్తిరాజేరు
మండలం లోని గడసాం, చినకాద, టి.బూర్జివలస అంగన్వాడీ కేంద్రాలను ఐసిడిఎస్ పీడీ టి.విమలారాణి మంగళవారం పరిశీలించారు. ముందుగా పిల్లల హాజరు రికార్డులను పరిశీలించారు. పిల్లల్లో మేధాశక్తిని పెంపొందించే విధంగా నేర్పించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు ఫీడింగ్ క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు. ఆమె వెంట సూపర్వైజర్లు శకుంతల, ఇంద్రభవాని, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.


అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీడీ

పూర్వ ప్రాథమిక విద్యను బోధించాలి

గంట్యాడ : ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్యను పిల్లలకు క్రమం తప్పకుండా బోధించాలని ఐసిడిఎస్ పిఒ ఉమాభారతి అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో పిల్లల దత్తత ప్రక్రియపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో పిఒ మాట్లాడారు. దత్తత ఏ విధంగా చేయాలి? దరఖాస్తు ప్రక్రియ ఎలా ఉంటుంది? తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ అధికారి బి.రామకోటి, మేనేజర్ త్రివేణి, తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై పశువులను విడిచిపెడితే చర్యలు

ప్రజాశక్తి- కంటోన్మెంట్
నగరంలోని రహదారులపై పశువులు స్వేచ్ఛగా సంచరించే విధంగా విడిచిపెడితే చట్టపరమైన చర్యలు తప్పవని ట్రాఫిక్ సిఐ సిహెచ్ సూరినాయుడు మంగళవారం హెచ్చరించారు. రహదారులపై పశువులు సంచరించడం వలన రహదారి ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో, ప్రజల ప్రాణాలు, వాహనదారుల భద్రత దృష్ట్యా జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రహదారులపై పశువులు తిరగడం వలన ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉన్నందున, పశువుల యజమానులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాఫిక్ సిఐ సూచించారు.

13న జాతీయ లోక్‌అదాలత్

ప్రజాశక్తి - గజపతినగరం
డిసెంబర్ 13న జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని స్థానిక కోర్టు న్యాయమూర్తి ఎ.విజయ్ రాజ్ కుమార్ కోరారు. మంగళవారం గజపతినగరం కోర్టు ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు, కక్షిదారులు లోక్ అదాలత్ ప్రాముఖ్యతపై అవగాహన పెంచుకోవాలని, రాజీ మార్గంలో పెండింగ్‌లో ఉన్న కేసులు, వివాదాలను పరిష్కరించుకోవడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

లేగదూడల ప్రదర్శన

ప్రజాశక్తి-తెర్లాం
మండలంలోని ఆమిటి గ్రామంలో మంగళవారం పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన ఏర్పాటుచేశారు. జిల్లా పశు వైద్యాధికారి కె.మురళీకృష్ణ, ఇఒ డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ అరుణ హాజరయ్యారు. 40 మంది రైతులు లేగదూడలను ప్రదర్శనలో ఉంచారు. ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పవన్ కుమార్, ఎంపిటిసి ఈశ్వరరావు, పశు వైద్య సహాయకులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-నెల్లిమర్ల
సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో వివిధ రకాల నైపుణ్య శిక్షణలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వైస్ చాన్సలర్ ప్రశాంత్‌కుమార్ మహంతి తెలిపారు. నెల రోజుల నుంచి మూడు నెలల కాల పరిమితి గల ఈ కోర్సులలో కొన్నింటికి ఉచితంగాను, మరి కొన్ని కోర్సులకు నామమాత్రపు రుసుంతో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. డ్రాపౌట్, పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, బి.టెక్/ ఎం.టెక్ అర్హత కలిగిన విద్యార్థులకు వివిధ రకాల అడ్వాన్స్ డ్ డిప్లమో కోర్సులను అందిస్తున్నట్లు చెప్పారు.


సిసి కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్ఐ సురేంద్ర

సిసి కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి-వేపాడ
మండలంలోని వీలుపర్తి గ్రామంలో సర్పంచ్ సేనాపతి లీల సహకారంతో సిసి కెమెరాలను ఏర్పాటుచేశారు. సుమారు రూ.50 వేలతో 8 కెమెరాలను ఏర్పాటుచేశారు. సిసి కెమెరాలు నిఘాకు ఎంతో ఉపయోగపడతాయని, నేరాలను అరికట్టవచ్చని ఎస్ఐ సురేంద్ర తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సేనాపతి అప్పారావు పాల్గొన్నారు.

గ్రామసభలో 25 పనులకు ఆమోదం

ప్రజాశక్తి-రేగిడి
మండలంలోని పుర్లి గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ పనులపై గ్రామసభ ఏర్పాటుచేశారు. ఇందులో రూ.60 లక్షలతో 25 పనులకు ఆమోదం పొందినట్లు ఎపిఒ హరినాథ్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి తారకేశ్వరరావు ఉన్నారు.

క్రీడా షూస్ పంపిణీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట
పట్టణానికి చెందిన చాంపియన్స్ స్పోర్ట్స్ హబ్ అధినేత వేమలి విద్యాసాగర్, ఆయన తండ్రి వేమలి అప్పారావు మంగళవారం లక్కవరపుకోట మండలం చందులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు రూ.50 వేలు విలువైన క్రీడా షూస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివరామకృష్ణ, పీడీ పి.శ్రీరాములు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-విజయనగరంకోట
రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి పలువురు పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. జమ్ము ఆరో డివిజన్‌లో వైసిపి నుంచి మాజీ సర్పంచ్ బార్నాల శ్రీను, వార్డు యువత అధ్యక్షులు బార్నాల శేఖర్, బార్నాల సంజీవరావు, కోట్ల వెంకట్రావు తదితరులు ఎమ్మెల్యే సమక్షంలో టిడిపిలో చేరారు. విజయనగరం పట్టణ పార్టీ అధ్యక్షులు గంటా రవి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. జి.అప్పలనాయుడు, కామేశ్వరరావు, నాగేశ్వరరావు, జనార్ధన రావు, చిన్నారావు, ఆదినారాయణ, గోవింద నాయుడు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వద్దు

ప్రజాశక్తి-సంతకవిటి
మండలంలోని మామిడిపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్లాస్టిక్ వినియోగంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత టి.టి.వి.రమణమూర్తి మాట్లాడుతూ పాలిథిన్ వాడకం ఆరోగ్యం, పర్యావరణానికి తీవ్రమైన ముప్పని హెచ్చరించారు. గుడ్డ సంచులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బంకి పార్వతి,

గ్రామ సచివాలయ సందర్శన

ప్రజాశక్తి-వేపాడ
మండలంలోని చినగుడిపాల గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఎంపిడిఒ సిహెచ్.సూర్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేస్తున్న కంపోస్టు పిట్ పనులను పరిశీలించారు. కంపోస్టు పిట్ వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు.

గరుగుబిల్లిలో గ్రామసభ

ప్రజాశక్తి- మెరకముడిదాం
మండలంలో గరుగుబిల్లిలో గ్రామకంఠంలో ఉన్న ఖాళీ స్థలాలకు హక్కు పత్రాల మంజూరుపై అభ్యంతరాల స్వీకరణకు మంగళవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ ఆవాల అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన స్వామిత్వ గ్రామసభలో అభ్యంతరాలను స్వీకరించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి చందక శ్రీరాములనాయుడు, ఎంపిటిసి చిరంజీవి నాయుడు, కార్యదర్శి గౌరినాయుడు, ఎస్‌టి సెల్ అధ్యక్షులు వరపుల శంకర్రావు, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి- కంటోన్మెంట్
విజయనగరం పట్టణం దాసన్నపేట కాళికామాత గుడి సమీపంలో కారు ఢీకొని వృద్ధుడు మంగళవారం మృతి చెందాడు.. టూ టౌన్ పోలీసులు కథనం ప్రకారం జమ్ముకు చెందిన నడిపేన చంద్రశేఖర్ (68)కాళికామాత గుడి వద్ద ఉండగా దాసన్నపేట రింగ్ రోడ్డు వైపును వస్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయలయ్యాయి .అదే కారులో పట్టణంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వృద్ధుడు మృతి చెందాడు. విజయనగరం టూ టౌన్ ఎస్ఐ ఎస్.కృష్ణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

కారు ఢీకొని ఒకరికి గాయాలు

ప్రజాశక్తి-రామభద్రపురం
మండలంలోని బూసాయవలస జాతీయరహదారి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. అతడ్ని ఢీ కొన్న కారులో నిప్పు రవ్వలు చెలరేగి మంటలు రాగా స్థానికులు ఎస్ఐ ప్రసాదరావు ఆర్పివేయడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు అయ్యింది. కారులో ఉన్నవాళ్లు క్షేమంగా బయటపడ్డారు. మండల కేంద్రం నుంచి స్వగ్రామానికి బైక్ పై వస్తున్న గొగ్గి లక్ష్మణరావును విజయనగరం నుంచి బొబ్బిలి వెళ్తున్న కారు ఢీకొంది. ఈఘటనలో లక్ష్మణ రావు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అతనిని 108లో బాడంగి సిహెచ్‌సికి తరలించారు. కారు బైక్‌ను అతివేగంగా ఢీకొనడంతో కారు ఇంజన్ లో మంటలు చెలరేగాయి. అయితే అక్కడే నీటి సదుపాయంతో పాటు జనం ఎక్కువగా ఉండడంతో మంటలు అదుపులోకి తెచ్చారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేరాలు ఘోరాలు

తమ్ముడిపై దాడిచేసిన అన్న అరెస్ట్

ప్రజాశక్తి-బాడంగి
మండలంలోని పెద్దపల్లి గ్రామానికి చెందిన కోటపర్తి కృష్ణ తన తమ్ముడు గురుమూర్తిపై ఆదివారం సాయంత్రం కత్తితో దాడి చేసి గాయపరిచాడు. తీవ్ర గాయాలతో గురుమూర్తి విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గురుమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కృష్ణను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తికి జైలుశిక్ష

ప్రజాశక్తి-రామభద్రపురం
స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద సోమవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో సాలూరు మండలం దత్తివలస గ్రామానికి చెందిన గంట వెంకటేష్ మద్యం తాగి వాహనం నడిపినట్లు రుజువైంది. ఆయనను మంగళవారం సాలూరు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టుకు తరలించగా న్యాయమూర్తి హర్షవర్ధన్ 14 రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. ఇంతవరకు రూ.10 వేలు జరిమానా మాత్రమే విధించేవారని, ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసే ఉద్దేశంతో శిక్షలు వేస్తున్నారని చెప్పారు.

మరో ఇద్దరికి

కంటోన్మెంట్ : బొండపల్లి పోలీసు స్టేషను పరిధిలో మద్యం సేవించి వాహనం నడిపి, బొండపల్లి పోలీసు లకు పట్టుబడిన గంట్యాడ మండలం కొర్లాం గ్రామానికి చెందిన ఇద్దరు నిందితులు బి.హేమంత్, విజయనగరానికి చెందిన అడపాక సాయికి గజపతినగరం అడిషినల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎ.విజయ్ రాజ్ కుమార్ 7 రోజుల జైలు శిక్ష విధించారు.